క్లుప్తంగా

కె.సంతపాలెంలో రెవెన్యూ గ్రామసభ


కె.సంతపాలెం రీసర్వే గ్రామసభలో అర్జీలను స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ రమేష్

కె.కోటపాడు : కె.సంతపాలెం గ్రామంలో సోమవారం రీసర్వే గ్రామసభ నిర్వహించారు. భూ వివరాలు ఆన్‌లైన్ నమోదుకు, పట్టాదార్ పాస్ పుస్తకాల్లో తప్పొప్పుల సవరణ, ఆధార్ సీడింగ్ కోసం 26 మంది అర్జీలను అందించారు. అర్జీలను పరిశీలన చేసి అర్హత గల వాటికి 15 రోజుల్లోగా పరిష్కరిస్తామని డిప్యూటీ తహసీల్దార్ రమేష్ తెలిపారు. మండల సర్వేయర్ రామచంద్రమూర్తి, సర్పంచ్ చల్లా మంగ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో లాభాలు


పంట పొలాలు పరిశీలిస్తున్న డీపీఎం లచ్చన్న

చీడికాడ : ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సిహెచ్.లచ్చన్న సోమవారం మండలంలో పలు గ్రామాల్లో పర్యటించి వరి పంటను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలు, రసాయన ఎరువుల ద్వారా పండించిన పంటలు మధ్య వ్యత్యాసం గురించి రైతులకు వివరించారు. ఖరీఫ్ వరి పంటకు ప్రస్తుతం కత్తెర పురుగు, ఉధృతి ఎక్కువగా వుందని, దీని నివారణకు అగ్నిస్త్రం పిచికారి చేయాలని సూచించారు.

మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట


అమ్మవారిని దర్శించుకుంటున్న ఆలయ కమిటీ సభ్యులు

చీడికాడ : మండలంలోని ఎ.అగ్రహారంలో నూతనంగా నిర్మించిన మరిడిమాంబ ఆలయం ప్రారంభంతో పాటు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట ఘనంగా జరిగింది. మూడు రోజుల నుంచి అంకురార్పణ పూజలతో ప్రారంభమైన ఈ ప్రతిష్ట కార్యక్రమాలు సోమవారం విగ్రహ ప్రతిష్టతో ముగిసాయి. అమ్మవారిని పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్న సమారాధనలో పాల్గొన్నారు.

వరిలో రెల్ల రాల్చు పురుగు ఉధృతి


క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీదేవి, సహాయకులు

నర్సీపట్నం : వరి పంటలో రెల్ల రాల్చు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నందున రైతులు నివారణ చర్యలు చేపట్టాలని ఏడీఏ టి.శ్రీదేవి సూచించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో పురుగు ఉధృతిని గుర్తించామన్నారు. పురుగు ఉధృతి ఎక్కువైతే ధాన్యం గింజలు పొలంలో రాలిపోవడం ద్వారా నష్టం జరుగుతుందన్నారు. పురుగును గుర్తించగానే పెర్మెత్రిన్ 400 మిల్లీ లీటర్లు, క్లోరాంట్రిపోల్ 60 మిల్లీ లీటర్ల మందును సాయంత్రం వేళలో పిచికారి చేయాలని రైతులకు సూచించారు.

వరి పంటను కాపాడుకోండి

నర్సీపట్నం : ఈ నెల 25, 26 తేదీల్లో భారీ వర్ష సూచన ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండి వరి పంటను కాపాడుకోవాలని ఏవో అప్పారావు సూచించారు. వరి పంట కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. కోత కోసిన పంటను త్వరగా కుప్పలు పెట్టుకోవాలన్నారు. వరి పంటపై రెల్ల రాల్చు పురుగు ఉధృతి అధికమవుతున్నందున పురుగు నివారణకు వ్యవసాయ అధికారులను సంప్రదించి మందు పిచికారి చేయాలన్నారు. కంకినల్లి నివారణకు బైఫెంత్రిన్ మందును పిచికారి చేయాలన్నారు. రబీ సీజన్ నుంచి పంటల బీమా రైతులు నమోదు చేయించుకోవాలన్నారు.

రోడ్డు విస్తరణ చేయడంతో అంతా ఆనందించారు. ఇక ట్రాఫిక్ సమస్య ఉండదనుకున్నారు. కానీ కొత్త రోడ్డు మధ్యలో నిర్మించిన డివైడర్లతో హడలెత్తిపోతున్నారు. ఈ డివైడర్లకు హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు లేక ఈ పరిస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

డివైడర్... తప్పని డేంజర్


ఇటీవల రాత్రి సమయంలో డివైడర్‌పైకి దూసుకుపోయిన కారు

- కానరాని హెచ్చరిక బోర్డులు
- రేడియం స్టిక్కర్లు లేక రాత్రి వేళల్లో ప్రమాదాలు
- నివారణ చర్యలు చేపట్టని అధికారులు
- వాహనదారులకు ఇక్కట్లు


డివైడర్‌పై ఇరుక్కుపోయిన లారీని పొక్లెయిన్‌తో తీస్తున్న దృశ్యం (ఫైల్)

మాకవరపాలెం : హుద్‌హుద్ తుపానుకు తాళ్లపాలెం–నర్సీపట్నం రోడ్డు దెబ్బతినడంతో ఎనిమిదేళ్ల క్రితం ప్రభుత్వం రూ.37 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో తాళ్లపాలెం నుంచి పెదబొడ్డేపల్లి వరకు 30 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం జరిగింది. రెండేళ్ల పాటు కొనసాగిన ఈ రోడ్డు పనుల్లో భాగంగా మండలంలోని తామరం నుంచి మాకవరపాలెం వరకు సుమారు కిలోమీటరున్నర పొడవున రోడ్డు మధ్యలో డివైడర్లు నిర్మించారు. వీటికి హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయలేదు.

హెచ్చరిక బోర్డులు ఏవీ...

రోడ్డు మధ్యలో ఉన్న ఈ డివైడర్లకు ఎటువంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకుండా వదిలేశారు. ఇక రాత్రి సమయాల్లో డివైడర్లు కనిపించేలా రేడియం స్టిక్కర్లు కూడా అతికించలేదు. దీంతో నిత్యం రాత్రి సమయంలో ఎదురుగా వచ్చే వాహనాల లైటింగ్ కారణంగా డివైడర్లు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా వీటిని నివారణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులు ఈ రోడ్డుపై ప్రయాణించేందుకు హడలిపోతున్నారు.

నెలకు 20కిపైగా ప్రమాదాలు..

డివైడర్లను ఢీకొని మండల కేంద్ర పరిధిలో నెలకు 20కి పైగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిలో అధికంగా కార్లే కావడం విశేషం. ఈ ప్రమాదాల్లో స్వల్ప గాయాలతోనే ప్రయాణికులు బయటపడగా కార్లు మాత్రం నుజ్జునుజ్జు అవుతున్నాయి. ఇవన్నీ డివైడర్లకు రంగులు వేయకపోవడం, హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు లేక జరిగినవే. మూడేళ్ల క్రితం డివైడర్‌ను ఆటో ఢీకొనడంతో అనకాపల్లికి చెందిన ఒక వ్యక్తి మరణించాడు. ఇవే కాకుండా తరచూ ద్విచక్రవాహనాలు, ఆర్టీసీ బస్సులు, లారీలు సైతం ప్రమాదాలకు గురవుతున్నాయి. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.


డివైడర్ ఢీకొని నుజ్జునుజ్జయిన కారు(ఫైల్)

ప్రమాదాలు నివారించాలి



తామరం నుంచి మాకవరపాలెం వరకు ఉన్న డివైడర్లకు హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలి. ఇవి లేకపోవడంతోనే రాత్రి సమయాల్లో నిత్యం ప్రమాదాలు జరిగి ఎందరో గాయాలపాలవుతున్నారు. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి.

–మళ్ల బాబూరావు, జి.కోడూరు

చర్యలు తీసుకుంటాం



ప్రమాదాల నివారణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. డివైడర్లకు హెచ్చరిక బోర్డులు, రేడియం స్టిక్కర్లు అమర్చుతాం. వాహనదారులు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలి. మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల కూడా ప్రమాదాల సంఖ్య అధికమవుతోంది. అందరూ రహదారి భద్రతను పాటించాలి. –దామోదర్‌నాయుడు,ఎస్‌ఐ,మాకవరపాలెం

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 10 ఫిర్యాదులు

నర్సీపట్నం : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో వి.వి.రమణ వివిధశాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆర్డీవో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. మట్టి మాఫియా జిరాయితీ భూముల్లో పెద్ద పెద్ద క్వారీలను ఏర్పాటు చేసి, నష్టం కలిగిస్తున్నారని దేవత కామేష్, వెలగా నారాయణరావు, కన్నయ్యశెట్టి ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. భూ సమస్యలు, ఇళ్ల స్థలాలు, సరిహద్దుల విషయమై ఎక్కువగా ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, జాప్యం చేస్తే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆర్డీవో సూచించారు.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో వి.వి.రమణ

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 1న ధర్నా

నర్సీపట్నం : స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను కేంద్ర ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని బీఎస్పీ నియోజకవర్గ సమన్వయకర్త బొట్టా నాగరాజు డిమాండ్ చేశారు. ధర్నాకు సంబంధించిన వాల్‌పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ డిసెంబర్ 1న బీఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వాడపల్లి రాజుబాబు, చిరంజీవి, ఎస్.అప్పారావు, గంగాధర్ పాల్గొన్నారు.


ధర్నా పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఎస్పీ నాయకుడు నాగరాజు

రాయితీపై సోలార్ యూనిట్లు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో, విద్యుత్ ఏఈ

మాకవరపాలెం : పీఎం సూర్యఘర్ పథకంలో రాయితీపై సోలార్ యూనిట్లకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి, విద్యుత్ ఏఈ బాలకృష్ణ తెలిపారు. 1 కిలోవాట్ యూనిట్‌కు ధర రూ.70 వేలు కాగా రూ.30వేలు రాయితీ ఉంటుందన్నారు. ఈ మేరకు పోస్టర్లను ఆవిష్కరించారు.

మాడుగుల : ప్రభుత్వ పథకాలు అందాలంటే ప్రతి ఖాతాకు ఫోన్ నంబర్ అనుసంధానం చేసుకోవాలని ఎంపీపీ వెంకటరాజారామ్ అన్నారు. సోమవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశమయ్యారు. రాయితీపై సోలార్ యూనిట్లు అందించే సూర్యఘర్ పథకం గురించి వివరించారు.

చీడికాడ: పీఎం సూర్యఘర్ పథకాన్ని అందరూ వినియోగించుకోవాలని ఎంపీడీవో వి.హేమసుందరరావు అన్నారు. సోమవారం ఎంపీడీవో సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, విద్యుత్ సిబ్బందితో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఈ వెంకటరావు,ఈఓపీఆర్‌డీ కామేశ్వరరావు పాల్గొన్నారు.

మార్మోగిన శివ నామస్మరణ


మాడుగుల : స్వయంభూ పరమేశ్వరస్వామి సన్నిధిలో..


దేవరాపల్లి : తిమిరాం శివాలయంలో పూజలు


కె.కోటపాడు : చౌడువాడ శివాలయంలో


నర్సీపట్నం : బ్రహ్మలింగేశ్వరస్వామికి అభిషేకాలు

మాడుగుల : కార్తీక నాలుగో సోమవారం సందర్భంగా శివాలయాలన్నీ శివనామస్మరణతో మారుమోగాయి. భీమలింగేశ్వరాలయం, పార్థసారథి కొండపై స్వయంభూ శివాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అన్న సమారాధన జరిపారు.

దేవరాపల్లి: తిమిరాం ఉమామహేశ్వరీ ఆలయంలో అభిషేకాలు, అర్చనలు చేశారు. దేవరాపల్లి వనదేవీశ్వర, ఉమామహేశ్వరీ దేవి, బోయిలకింతాడ శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి.

బుచ్చెయ్యపేట : మేజర్ పంచాయితీ వడ్డాది, బుచ్చెయ్యపేట, విజయరామరాజుపేట, రాజాం, దిబ్బి డి, పెదమదీన తదితర గ్రామాల్లోని శివాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాతవరం : వి.బి.అగ్రహారం గ్రామంలో వేలసిన పురాతన శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయానికి, చిక్కుడుపాలెం భూగర్భ శివాలయానికి భక్తులు పోటెత్తారు. గిరిజనులు సరుగుడు జలపాతంలో స్నానాలు చేసి, శివలింగం వద్ద పూజలు చేశారు. **గొలుగొండ :** ధారమఠం శివాలయం వద్ద భక్తులు జలపాతాల వద్ద స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు.

చీడికాడ : చీడికాడ, ఖండివరం, ఎల్.బి.పట్నం, పెదగోగాడ, బి.సింగవరం, తురువోలు శివాలయాల్లో పరమశివునికి అభిషేకాలు నిర్వహించారు. తురువోలు శివాలయం వద్ద అన్నసమారాధన జరిపారు.

కె.కోటపాడు : ఆర్లి గ్రామంలో గల స్వయంభూ భ్రమరాంబ సహిత మల్లికార్జునస్వామి ఆలయం, కె.కోటపాడు భీమలింగేశ్వరాలయం, ఎ.కోడూరులో భ్రమరాంబికా సహిత మల్లికార్జునస్వామి ఆలయం, చౌడువాడలో కాశీవిశ్వేశ్వర ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆర్లి శివాలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

మాడుగుల రూరల్ : కె.జె.పురం, జంపెన, ఎం.కోడూరు కాశీ విశ్వేశ్వర ఆలయం, మహంకాళేశ్వరుడు, పిట్టగెడ్డ శివాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. వీరవల్లి అగ్రహారం శివాలయం వద్ద భారీగా అన్నసమారాధన జరిపారు.

రోలుగుంట : రోలుగుంట కాశీ విశ్వేశ్వర ముత్యం జయ ఆలయానికి వేకువజాము నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.


నర్సీపట్నం : బలిఘట్టం బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర వాహిని సత్యనారాయణస్వామి ఆలయంలో శివలింగాన్ని భక్తులు దర్శించుకున్నారు.

మాకవరపాలెం : పెద్దమిల్లు జంక్షన్‌లోని స్వయం భూ వామలింగేశ్వస్వామి, గిడుతూరు గంగాధరేశ్వరస్వామి, పి.పి.అగ్రహారం అమృతేశ్వరస్వామి ఆలయాల్లో కార్తీక సోమవారం పూజలు ఘనంగా జరిగాయి.

తుపాను హెచ్చరికలతో రైతుల్లో గుబులు


మాడుగుల: తుపాను హెచ్చరికలుతో ఖరీఫ్ వరి కోతలు కోసిన రైతులు పోలాల్లోనే ధాన్యం నూర్పిడి చేస్తున్నారు. ఎండలు తగ్గుముఖం పట్టడంతో ధాన్యం ఎండడంలేదని, రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం తుపాను ప్రభావంతో రైతులందరూ వరి చేలు కూడదీసే పనిలో ఉన్నారు. వర్షాలు చూసుకుని కోతలు ప్రారంభించాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

గొలుగొండ: తుఫాన్ ప్రభావం ఉంటే వరి పంటకు తీవ్ర నష్టం వస్తుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. విప్పలపాలెం ఆయకట్టు దిగువన 1500 ఎకరాల్లో నాట్లు జరిగాయి. ధారగెడ్డ, రావణాపల్లి జాలాశయాల దిగువన 3400 ఎకరాల్లో నాట్లు జరిగాయి. ఇప్పటికే ధారపాలెం, విప్పలపాలెం, కొత్తపాలెం, పాత మల్లంపేట తదితర ప్రాంతాల్లో సుమారుగా 500 ఎకరాల్లో వరి కోతలు పూర్తి అయ్యాయి. ప్రస్తుతం ఈ పంట పొలంలో ఉంది. మరో 3 వేలకు పైగా ఎకరాల్లో వరి కోత దశలో ఉంది. తుపాను సూచనలతో రక్షణ కోసం వరిలో బాటలు చేసే పనుల్లో రైతులు నిమగ్నమ అయ్యారు.


మాడుగులలో పొలాల్లో ఆరబెట్టిన ధాన్యం

ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదులు

దేవరాపల్లి : ఎంపీడీవో కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజుతో కలిసి ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వాలాబు పంచాయతీ శివారు ఇప్పగరువు రోడ్డును స్థానికులు కొందరు ఆక్రమించారని గ్రామస్తులతో పాటు గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.టి.దొర ఫిర్యాదు అందజేశారు. ఉపాధి హామీ పథకంలో రోడ్డు వేయగా గత 25 ఏళ్లుగా స్థానిక ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారని, ఐదు నెలలుగా కొందరు రోడ్డును ఆక్రమించి రాకపోకలను అడ్డగిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.


దేవరాపల్లిలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్న ఎంపీపీ బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ సత్యం

బాలికలపై హింసను ఖండించాలి

బుచ్చెయ్యపేట : బాలికలు, మహిళలపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని విజయరామరాజుపేట ప్రభుత్వ పాఠశాల హెచ్‌ఎం యమున తెలిపారు. సోమవారం హింసా నిర్మూలన దినం సందర్భంగా అతిథి దేవో భవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విజయరామరాజుపేటలో విద్యార్థులు, అంగన్‌వాడీ సిబ్బందితో ర్యాలీ మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న దాడులకు పాల్పడే నిందితులకు కఠిన శిక్షలు వేగవంతంగా పడేలా, అటువంటి నేరాలకు పాల్పడాలంటే పురుషుల్లో భయం పుట్టేలా చట్టాలను సవరించాలని సంస్థ నిర్వాహకుడు ఆరిపాక కామేశ్వరరావు అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది టి.అప్పారావు, వి.అరుణ, ఆర్.దేవి తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి : జెండర్ ఆధారిత హింసను వ్యతిరేకిద్దామని దేవరాపల్లి వెలుగు కార్యాలయ సిబ్బంది, డ్వాక్రా మహిళలు నినాదాలు చేశారు. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం కార్యక్రమంలో భాగంగా సోమవారం వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు అవగాహన ర్యాలీ, మానవ హారం చేపట్టారు. హింసకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడుదామని నినాదాలు చేశారు. సోమవారం నుంచి ప్రారంభమైన ఈ ప్రచారం వచ్చే నెల 23 వరకు కొనసాగుతుందని సీసీ గౌరీశ్వర్ అన్నారు.


పేటలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

అమ్మ వాసవీ సంఘం సేవలు అభినందనీయం

నాతవరం : అమ్మవాసవీ సేవా సంఘం అందిస్తున్న సేవలు అందరి మన్ననలు పొందుతున్నాయని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అన్నారు. తాండవ ఇరిగేషన్ ప్రాంగణంలో గల ఉసిరి చెట్టు వద్ద సోమవారం అమ్మవాసవీ సేవా సంఘం మండల అధ్యక్షురాలు ఇట్టంశెట్టి అక్కయ్యమ్మ, గౌరవ అధ్యక్షుడు పేరూరి బుల్లిదొర ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ సంస్థ సేవలను కొనియాడారు. విద్య, వైద్యం, అన్నదానం, దుస్తుల పంపిణీ వంటి కార్యక్రమాలతో పేదలకు సేవలందించారని తెలిపారు. సంఘ సేవా కార్యక్రమాల గురించి ఇట్టంశెట్టి అక్కయ్యమ్మ వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు శ్రీరంరెడ్డి సావిత్రి, పార్టీ సీనియర్ నాయకుడు ఎస్. చిన సత్యం, అంకంరెడ్డి చిన జమీలు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న అమ్మవాసవీ సేవా సంఘం మండలశాఖ అధ్యక్షురాలు ఇట్టంశెట్టి

శాంతియుతంగా జాతర జరగాలి

మాకవరపాలెం : నల్లమారమ్మ జాతరను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని రూరల్ సీఐ రేవతమ్మ సూచించారు. జి.కోడూరు గ్రామంలో గురువారం నల్లమారమ్మ జాతర జరగనుంది. ఈ నేపథ్యంలో సోమవారం ఇక్కడి సచివాలయంలో ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో సీఐ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎలాంటి గొడవలకు తావులేకుండా పండగ జరుపుకోవాలన్నారు. పండగ రోజు రాత్రి గ్రామంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా గ్రామ సరిహద్దు ప్రాంతాల్లోనే వాహనాలను నిలిపివేస్తామన్నారు. ఎస్ఐ దామోదరనాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బొడ్డేటి వెంకటరమణ, వెలగా రమణ, జయబాబు, పిల్లా శ్రీను, జగన్నాథరావు, రామసత్యనారాయణ పాల్గొన్నారు.


కమిటీ సభ్యులతో సమావేశమైన సిఐ, ఎస్ఐ

మాదకద్రవ్యాలతో జీవితాలు నాశనం

- విద్యార్థులకు సీఐ రేవతమ్మ హితవు

మాకవరపాలెం : మాదక ద్రవ్యాలకు దూరం కాకుంటే జీవితాలు నాశనం అవుతాయని నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మ విద్యార్థులకు సూచించారు. తామరం అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం గంజాయి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కొందరు గంజాయిని తాగడమేగాక తరలిస్తున్నారన్నారు. గంజాయి రవాణా చేస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవన్నారు. కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడకుండా సీనియర్, జూనియర్ విద్యార్థులు స్నేహభావంతో మెలగాలన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ మోహన్‌రావు, స్థానిక ఎస్ఐ దామోదర్‌నాయుడు విద్యార్థులద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నర్సీపట్నం : మాదకద్రవ్యాల జోలికి వెళ్లి భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని టౌన్ సీఐ జి.గోవిందరావు విద్యార్థులకు సూచించారు. శ్రీవిద్య కళాశాలలో మాదకద్రవ్యాల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చాలా మంది గంజాయి మత్తుకు అలవాటు పడుతున్నారని తెలిపారు. గంజాయి తాగిన, రవాణా చేసినా, కొనుగోలు చేసినా చట్ట రీత్యా నేరమని, వాటి జోలికి వెళ్లరాదని విద్యార్థులకు హితవు పలికారు. ఎస్ఐ ఉమామహేశ్వరరావు, కరస్పాండెంట్ సత్యవేణి, డైరెక్టర్ దొరబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో సీఐ రేవతమ్మ

ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిర్ణయాలపై నేడు ధర్నా

కె.కోటపాడు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు నష్టం కలిగించేలా తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను ప్రజలు గుర్తించాలని సీపీఎం నాయకులు గండి నాయినిబాబు, యర్రా దేముడు అన్నారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలకు వ్యతిరేకంగా ఈ నెల 26న కె.కోటపాడులో నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో కార్మికులు, కర్షకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. నాయినిబాబు మాట్లాడుతు భూ యజమాని అంగీకారం అవసరం లేకుండా కౌలు రైతులకు రుణాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు, వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం నెలకు రూ.10వేల పింఛను ఇవ్వాలని, 2020 నూతన విద్యుత్ చట్టాన్ని రద్దు చేయాలని, ట్రూ యాప్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న నాయినిబాబు, దేముడు

కాశీవిశ్వేశ్వర ఆలయంలో పలువురికి సత్కారం

మాడుగుల రూరల్ : నాలుగవ కార్తీక సోమవారం పురస్కరించుకుని ఎం. కోడూరు కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో పలువురు ప్రముఖులను ఆలయ కమిటీ వారు సన్మానించారు. ఆలయం వెనుక అసంపూర్తిగా నిల్చిన కమ్యూనిటీ హాలును పూర్తి చేసినందుకు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావును పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలు అందజేసి సత్కరించారు. అలాగే మాడుగులకు చెందిన ప్రముఖ సిద్ధాంతి భమిడిపాటి సుబ్రమణ్యశాస్త్రికి పార్వతి, పరమేశ్వరుల జ్ఞాపికను అందజేసి సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ చింతా వెంకట నారాయణమూర్తి, కమిటీ సభ్యులు సత్యనారాయణ, అప్పలనర్సయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


ఎం.కోడూరు కాశీ విశ్వేశ్వర ఆలయంలో సర్పంచ్ సంజీవిరావును సన్మానిస్తున్న ఆలయ కమిటీ